# వంశప్రతిష్ఠ

కాకాని కమల



## "మంగులుగాడ్ని జైల్లో పెట్టారు."

ఈ వార్త ఊరంతా ముఖ్యంగా.... దొంగల ప్రపంచాన్ని అట్టుడికించింది.

మంగులు గాడేవిటి? పట్టుబడట మేమిటి? గజదొంగ గంగులు కడుపున పుట్టిన మంగులు పోలీసుల చేతికి చిక్కటం ఏమిటి? ఎనిమిదవ వింత కాకపోతే...

పుట్టిన క్షణం నుంచి తన డెబ్బైవ యేట (70) మరణించే వరకు పోలీసుల్ని పక్కలో బల్లెంలా గజగజ వణికించాడు. గంగులు పేరు చెపితే పోలీసుల శరీరం మీద వెంట్రుకలు నిగ్గబొడుచుకొనేవి. పసి పిల్లలు పాలుతాగటం మానేసేవారు.

అంత భయంకరమైన గజదొంగగా కీర్తి గడించుకొన్నాడు గంగులు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు గంగులు తల్లి గర్భం నుంచి భూమి మీద పడగానే కేరు కేరు మని ఏడుస్తుంటే మంత్రసాని బొడ్డు కోసి తల్లి ఒళ్ళో వేసింది.

బిడ్డకి పాలు కుడిపి పక్క మీద వేసిన కాసేపటి తర్వాత తల్లి మెళ్ళో బంగారు గొలుసు మటుమాయం అయ్యింది.

పురిటి గదంతా వెదికారు. మంత్రసాని తప్పించి మూడో మనిషి గదిలోకి రాలేదు. అదే ఎత్తుకు పోయి వుంటుంది అనుకొన్నారంతా.

కాని ఆ సాయంత్రం లాల పొయ్యటానికని బాలగంగులు గాడి మూసుకొన్న బుల్లి గుప్పెట విప్పితే బంగారుగొలుసు భద్రంగా వుంది.

"భళీ? నా కొడుకు గొప్ప గజదొంగ అవుతాడు. నన్ను మించిన కేడీ అవుతాడు" అని గంగులు తండ్రి గజదొంగ గంగులు సంబరంతో గెంతులు వేశాడు.

ఆ తర్వాత కూడా అలాంటి అద్భుతాలు ఎన్నో చేశాడు బాల గంగులు. చివరికి తన డెబ్బైవ ఏట చనిపోయే చివరి క్షణం వరకు భయంకరమైన నేరాలను దోపిడీలు, ఖూనీలు చేసినా 'జైలు' అనే పదానికి అర్థం తెలియకుండా పోలీసుల కన్ను కప్పుతూ దిగ్విజయంగా గజదొంగగా తన జీవితాన్ని పూర్తి చేశాడు గంగులు.

"గంగులు" అంటే దొంగ కులానికి పెద్ద గురువు. గొప్ప సలహాదారు.

పోలీసులకి చిక్కకుండా దొంగతనం చెయ్యటం ఎలా?

దొంగతనం అసలు ఎలా చెయ్యాలి?

ఎలా తప్పించుకోవాలి?

ఎవ్వరు ఎలాంటి దొంగతనాలు చెయ్యాలి? ఇలాంటి ఎన్నో చిట్కాలు కొత్తగా వృత్తిలోకి వచ్చిన వాళ్ళకి క్షుణ్ణంగా నేర్పించి శిక్షణ ఇచ్చేవాడు.

అలాంటి గంగులు కడుపున పుట్టిన మంగులు పోలీసుల చేతికి చిక్కటమే కాక జైల్లో పడ్డాడు అన్న వార్త ఇంటిల్లిపాదిని కుదిలించి వేసింది.

"ఇదెక్కడి ప్రారబ్ధంరా వాయనా. తరతరాలుగా మనది దొంగల వంశం. గజదొంగ గంగులు అంటే ప్రభుత్వాన్నే గజగజ లాడించిన నేరస్తుడు. దొంగతనాలు దోపిడీలు చేసి కోట్లు గడించుకున్నా ఆదేమని అడిగే ధైర్యం లేకపోయింది ఎవుడికీనూ సరి కదా మన వంశం నుంచి ఎంతో మంది రాజకీయాల్లోకి వెళ్ళి దానధర్మాలు చేసి ప్రజాసేవకులుగా దేశభక్తులుగ చరిత్రకెక్కారు. దొంగతనం చేసి పట్టుబడి జైలు కెళ్ళిన సంఘటన ఒక్కటి లేదు. కాకుంటే రాజకీయ ప్రవేశం తర్వాత దేశం కోసం చేసిన పోరాటాల సందర్భంగా జైలు కెళ్ళిన సంఘటనలు, ప్రజలు కీర్తించిన సంఘటనలే వున్నాయి గాని... పైగా మీ నాన్న ఈ విషయాల్లో పెద్ద గురువు. అటువంటి మహానుభావుడి కడుపున పుట్టిన నువ్వు ఇలా చిన్న దొంగతనం చేస్తూ పోలీసులకి పట్టుబడడం ఏమిటి? పైగా ఇలా జైల్లో పడడం ఏమిటి? విడ్డూరం కాకపోతే... అదీ గాక నువ్వు దొంగతనం చేసినప్పుడు ఆ ఇంట్లో ఎవరూ లేరాయే! అంతా తలుపులు తాళాలు పెట్టి పై ఊరికి వెళ్ళిపొయ్యారాయె. మీ నాన్న చచ్చిపోబట్టి గాని ఆ దొంగ మహారాజ్ బతికుంటే గుండెలు ఆగిపోయి వుండేవి కదరా నువ్వు జైలు పాలు అయినందుకు పులి కడుపున పిల్లి పుట్టినట్టు..." నాయనమ్మ దాకూరాణి జైలు కటకటాలు పట్టుకుని మనవడ్ని చూస్తూ వలవల ఏడుస్తుంటే–

"అసలు దీనికంతటికీ కారణం నువ్వేనే నానమ్మా" అంటూ గయ్యమన్నాడు మంగులు తెగ చిరాకు పడిపోతూ.

"అదేవిట్రా నేనా? నేనేం చేశానురా?" అంది నాయనమ్మ దాకూరాణి విస్తుపోతూ

"అవును. నువ్వేనే. అస్తమానం దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకో వాలి అనే దానివిగా?"

"అవును"

"అందుకే ఇంట్లో మనుషులు ఎలాగూ లేరు కదా. పైగా బయట తాళం వుంది అని నేను ఇల్లంతా లైట్లేసి ఇల్లు చక్కబెట్టడం మొదలు పెట్టాను. ఇరుగుపొరుగులకి అనుమానం వచ్చి పోలీసుల్ని పిలిచారు... నాలుగు వైపుల నుంచి ఆ ఇంటిని చుట్టుముట్టారు..."

"ఓరి వెర్రి నాగన్నా... వా కొడుకు కడుపున చెడపుట్టావు కదరా. మన దొంగ వృత్తికే మచ్చ తెచ్చావు కదరా..." అంటూ మళ్ళీ గొల్లు మంది ఆ ముస... దొంగ ముసల్ది. ◆